క్లుప్తంగా

కట్టడాలకు జియో ట్యాగింగ్



జియో ట్యాగింగ్ పరిశీలిస్తున్న కమిషనర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో భువన్ సర్వే పనులు కొనసాగుతున్నాయి. ఈ మేరకు శనివారం పెద్దనపల్లి, రైల్వేస్టేషన్ ఏరియాలో నిర్మించిన శాశ్వత కట్టడాలకు సర్వేలో భాగంగా జియో ట్యాగింగ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ జియో ట్యాగింగ్ పనులను, ఇళ్ల కొలతను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారంగా సర్వే చేసి కట్టడాలకు జియో ట్యాగింగ్ పరిపూర్ణంగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి, రెవెన్యూ ఇన్స్పెక్టర్, వార్డు అధికారి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మికులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 14 నుంచి చేపట్టనున్న విద్యుత్ శాఖ ఆర్టిజన్స్ కార్మికుల నిరవధిక సమ్మె పోస్టర్లను శనివారం జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం ఆవరణలో ఆర్టిజన్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్, కన్వీనర్లు పసుల తిరుపతి, తోట నగేశ్ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగ భద్రత లేదని, ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయడం లేదన్నారు. విద్యార్హతను బట్టి కన్వర్షన్ చేయాలన్నారు. ఉద్యోగ భద్రత, ఆత్మగౌరవం, సంస్థ రక్షణ కోసం జరిగే ఈ నిరవధిక సమ్మెలో ఉద్యోగులందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఆర్టిజన్ కార్మికులు వెంకటేష్, శ్రీనివాస్, రమేష్, దశరథం, కల్లూరి రమేష్, సునిల్, రవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు దూరంగా ఉండాలి

మందమర్రిరూరల్: ఈ నెల 9న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి ఉద్యోగులు పాల్గొనొద్దని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సింగరేణి సంస్థకు సంబంధించిన అంశాలపై కార్మిక సంఘాలు సమ్మె చేయడం లేదని, ఉద్యోగులు ఈ విషయాన్ని గమనించి విధులకు విధిగా హాజరై సంస్థను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ఎరువుల కొరత తీర్చాలని వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నెన్నెల: మండలంలో ఎరువుల కొరత తీర్చాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని మండల బీఆర్ఎస్ నాయకులు శనివారం ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏవో సృజనకు వినతిపత్రం సమర్పించారు. యూరియా అందకపోవడంతో ఎరువుల దుకాణాల ముందు రైతులు బారులు తీరుతూ కొట్లాడుకుంటున్నారని ఆరోపించారు. డీలర్లు ఎమ్మార్పీ ధరలకంటే అదనంగా వసూలు చేస్తున్నారని, రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై యూరియా అందజేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, మాజీ ఎంపీటీసీ తిరుపతి, మాజీ ఆత్మ చైర్మన్ సున్నం రాజు, నాయకులు రాంచందర్, ప్రతాప్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

దండేపల్లి/జన్నారం: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 7న జయప్రదం చేయాలని జిల్లా ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య పిలుపునిచ్చారు. దండేపల్లి, జన్నారం మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించాలన్నారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలతో శనివారం సమావేశం నిర్వహించారు. దండేపల్లిలో మండల అధ్యక్షుడు మంతెన నవీన్, జిల్లా కార్యదర్శి ముల్కల్ల నరేష్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు లింగపెల్లి బాపు, అట్రాసిటీ జిల్లా మెంబర్ బచ్చల అంజన్న, జన్నారంలో మండల అధ్యక్షుడు కొండగూరు ప్రభుదాస్, మండల ప్రధాన కార్యదర్శి జంగం రవి, నాయకులు పాల్గొన్నారు.

పశువులకు అడ్డాగా రహదారులు



రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో పశువులు ప్రధాన రహదారులపై సంచరిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. పశువుల యజమానులు కొంతమంది ఏమాత్రం పట్టించుకోకుండా వదిలేస్తుండటంతో రోడ్లపై సేదతీరుతున్నాయి. మంచిర్యాల–మందమర్రి మార్గమధ్యంలోని జాతీయ రహదారిపై కూడా పశువులు నడిరోడ్డుపై తిష్టవేస్తుండటంతో పలుమార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా పశువులు రోడ్డుపై సంచరించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తీగ చుట్టూ అల్లుకున్న ప్రమాదం



మంచిర్యాలఅగ్రికల్చర్: ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగిన పచ్చిక బయళ్లు గడ్డి తీగలు తినేందుకు మూగజీవాలు వెంపర్లాడుతున్నాయి. జిల్లా కేంద్రంలోని పలుకాలనీల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ గడ్డి పెరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రమాదం జరగకముందే విద్యుత్ శాఖ సిబ్బంది, గడ్డి తీగలను తొలగించి ప్రమాదాలు నివరించాలని పలువురు కోరుతున్నారు.

కొమ్మలు కమ్ముకొస్తున్నయ్..!



చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్ర గుంటపల్లి గ్రామ సమీపంలో కొమ్మెర, ఇతర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపైకి చెట్ల కొమ్మలు కమ్ముకొస్తున్నయ్. ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని రోడ్డు పైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

అరకొర సిబ్బంది.. అద్దె గదులు

- ప్రభుత్వ హెల్త్ సబ్‌సెంటర్లలో మౌలిక వసతులు కరువు
- పక్కా భవనాలు లేక అవస్థలు
- ఇబ్బంది పడుతున్న రోగులు

నస్పూర్: పేదలకు మెరుగైన వైద్యం అందించాల్సిన ప్రభుత్వ హెల్త్ సబ్‌సెంటర్లు ఎలాంటి మౌలిక వసతులు లేని అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. పక్కా భవనాలు ఉన్నచోట సిబ్బంది కొరత వల్ల రోగులకు సకాలంలో సరైన వైద్యం అందడం లేదు. పట్టణ పరిధిలో ఒక పీహెచ్‌సీ, ఒక యూపీహెచ్‌సీ, 11సబ్ సెంటర్లు, ఒక ఆయుర్వేదిక్ ఆసుపత్రి ఉన్నాయి. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ పక్కా భవనాలలో కొనసాగుతుండగా యూపీహెచ్‌సీలో కేవలం ఒక మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు, డాటా ఎంట్రీ అండ్ ఆపరేటర్, ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్‌ను కేటాయించారు. వారందరూ డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తుండగా, ప్రస్తుతం ఒక మెడికల్ ఆఫీసర్, ఒక స్టాఫ్‌నర్సు, ఒక సపోర్టింగ్ స్టాఫ్ మాత్రమే ఉన్నారు. దీంతో రోగులకు సరైన వైద్యం అందించడంలో జాప్యం జరుగుతుంది.



పీహెచ్‌సీ ఆవరణలో చిన్న గదిలో ఆయుర్వేదిక్ ఆసుపత్రి



పీహెచ్‌సీ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న ఆయుర్వేదిక్ ట్రైనీ పరికరాలు

పీహెచ్‌ఎసీ ఆవరణలో ఒక చిన్న గదిలో ఆయుర్వేదిక్ ఆసుపత్రి కొనసాగుతుండగా ఒక మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సు, అటెండర్లు ఉన్నారు. ఫిజికల్ ట్రైనర్, తదితర సిబ్బంది కొరత ఉంది. ఫిజికల్ ట్రెయినీ పరికరాలను సైతం పీహెచ్‌సీ ఆవరణలో ఒక గదిలో నిరుపయోగంగా పడేశారు. పీహెచ్‌సీ పరిధిలో 11సబ్ సెంటర్లు ఉండగా వీటిలో ఏడు సెంటర్లలో ఎమ్ఎల్‌హెచ్‌పీ(మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్) ఉండగా 52ఆశావర్కర్లు, 11ఏఎన్ఎమ్‌లు ఉన్నారు. వీటిలో తొమ్మిది సబ్ సెంటర్లు ఎలాంటి మౌలిక వసతులు లేని అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. సబ్ సెంటర్లలో అందరూ మహిళా సిబ్బందే విధులు నిర్వహిస్తారు. సబ్ సెంటర్లలో కనీసం టాయిలెట్స్ లేక నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో వర్షపు నీరు లోపలికి చేరి మందులు, విలువైన సామగ్రి సైతం తడిసిపోయే ప్రమాదం ఉంది. కాగా గత ఎనిమిది నెలలకు పైగా అద్దెను సైతం ఏఎన్ఎంలే చెల్లిస్తుండడం గమనార్హం. ఈ విషయమై స్థానిక మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్‌ను వివరణ కోరగా నేను ఇటీవలే విధుల్లో చేరానని, అద్దె విషయమై తనకు సమాచారం లేదని వివరాలు తెలుసుకొని తెలియపరుస్తానని చెప్పారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

కాసిపేట: నేరాల నియంత్రణ కోసమే గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. మండలంలోని మామిడిగూడలో శనివారం ఎక్సైజ్‌శాఖ అధికారులు, డాగ్ స్క్వాడ్‌తో కలిసి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రజల రక్షణ, భద్రత పోలీస్‌ల బాధ్యత అని ఏసీపీ తెలిపారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు, నేరస్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, వాట్సప్ కాల్స్‌కు స్పందించొద్దని తెలిపారు. గుడుంబా అమ్ముతున్న వ్యక్తి వద్ద రెండున్నర లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ అధికారులకు అప్పగించడంతో పాటు వాహనపత్రాలు సక్రమంగా లేని 25ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, మందమర్రి సర్కిల్‌లోని ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

‘రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెదలాలి’

మందమర్రిరూరల్: రౌడీషీటర్లు నేర ప్రవర్తనను వీడి, సత్ప్రవర్తనతో మెదలాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని సర్కిల్ ఆఫీస్ ఆవరణలో శనివారం సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని పాత నేరస్తులు, రౌడీషీటర్లకు అవగాహన కల్పించారు. ఇక ముందు సమాజంలో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

ఇదేం ‘చెత్త’ పని..!





మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని కొందరు పారిశుద్ధ్య కార్మికులు నగరంలో సేకరించిన చెత్తను ఆండాళమ్మ కాలనీలోని డంప్ యార్డుకు తరలించకుండా, అందులోని విద్యుత్ వైర్లు, ఇతర సామగ్రిని తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా నగర శివారు ప్రాంతంలోని రంగంపేట్ వరకు చెత్త వాహనాన్ని తీసుకెళ్లి, అందులోని చెత్తను రోడ్డు పక్కన వేసి కాల్చివేస్తున్నారు. మిగిలిన చెత్తను డంప్‌యార్డుకు తరలిస్తున్నారు. చెత్తలో కలిసిన విద్యుత్ తీగలు మంటలో కాలడంతో, అందులో నుంచి బయటపడిన రాగి తీగలను తీసుకొని అమ్ముకుంటున్నారు. రాగి తీగలు కిలోకు దాదాపుగా రూ.600 ఉండగా, ఆ తీగల కోసం ట్రాలీలో తీసుకొచ్చిన చెత్తను మంచిర్యాల శివారులోని రోడ్ల పక్కన వేసి కాల్చడంపై స్థానికుల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది. స్థానికులు పారిశుద్ధ్య కార్మికులను చెత్తను ఎందుకు కాలుస్తున్నారని అడిగితే, కాలుతున్న చెత్తను చల్లార్చి వెళ్లిపోతున్నారు. దీంతో శివారులోని రోడ్ల పక్కన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి

శ్రీరాంపూర్: ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. నాయకులు ఎస్ఆర్పీ 1 గనిలో శనివారం గేట్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేదిక నాయకులు హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య, ఫిట్ సెక్రెటరీ రేగుంట సందీప్, ఐఎఫ్‌టీయూ నాయకులు బ్రహ్మానందం, మేకల రాములు, సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు సమ్ము రాజయ్య, దేవి సత్యం, ఏఐఎఫ్‌టీయూ పోచమల్లు తదితరులు పాల్గొన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిని స్తంభింపజేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. జేఏసీ ఆధ్వర్యంలో ఆర్కే 5 గని, సీహెచ్‌పీ గనులపై శనివారం గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులనుద్దేశించి మాట్లాడారు. సమ్మె విజయవంతం చేస్తేనే కేంద్రం దిగొచ్చి ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేస్తుందన్నారు. కార్మిక వర్గం అంతా ఏకతాటిపై నిలబడి సమ్మెలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, నాయకులు ప్రసాద్ రెడ్డి, నరసింగరావు, ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, గరిగే స్వామి, మల్లారెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి, గుల్ల బాలాజీ, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బండి స్వామి, పొగాకు రమేష్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను కార్మికులు దిగ్విజయం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు కోరారు. శనివారం బెల్లంపల్లి సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం జరిగే సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు సంపూర్ణంగా పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి, రాజేష్, చంద్రశేఖర్, రమేష్, నరేష్, రవి, మొగిలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక



రాథోడ్ యోగేశ్వర్ ఏల్పుల నరేందర్ కొత్త అనిల్



మూగల హారిక కామేర హారిక పెరుగు అక్షర

జన్నారం: బాసర ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లు పొందడానికి జన్నారం మండలం నుంచి 12మంది విద్యార్థులు ఎంపిక కాగా, కిష్టాపూర్ ఉన్నత పాఠశాల నుంచి ఆరుగురు ఎంపికయ్యారు. ఇందులో కిష్టాపూర్ ఉన్నత పాఠశాల నుంచి రాథోడ్ యోగేశ్వర్, ఎల్పుల నరేందర్, కొత్త అనిల్, మూగల హారిక, కామేర హారిక, పెరుగు అక్షర, కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి షేక్ అశ్వక్, హన్మండ్ల సాయి శ్రీకర్, చింతగూడ ఉన్నత పాఠశాల నుంచి జాదవ్ గంగాభవాని, లాకవత్ దీపిక, ఇందన్‌పల్లి ఉన్నత పాఠశాల నుంచి మోటూరి సంజన, బాలికల ఉన్నత పాఠశాల నుంచి శ్రీనిధిలు ఎంపికైనట్లు మండల విద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. ఎంపిక విద్యార్థులను సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.



అక్షయ

దండేపల్లి: దండేపల్లి మండలం వెలగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన మ్యాన అక్షయ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.విజయలక్ష్మి తెలిపారు. విద్యార్థినిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

బెల్లంపల్లి: విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వద్ద శనివారం ఎస్ఎఫ్ఐ శ్రేణులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు రవికాంత్, విజయ్‌సాయి, సాయికుమార్ పాల్గొన్నారు.

రాయితీపై కంది విత్తనాల పంపిణీ

కాసిపేట: జాతీయ భద్రత ఆహార పథకం కింద మండలంలోని ముత్యంపల్లి రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం రాయితీపై కంది విత్తనాలు పంపిణీ చేశారు. పత్తి వేసే రైతులు కంది పంటను అంతర్ పంటగా సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ప్రభాకర్, పీఏసీఎస్ చైర్మన్ నీల రాంచందర్, ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, ఏఈవోలు శ్రీధర్, ప్రతిభ, నాయకులు శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

‘గుడుంబా అమ్మితే కఠిన చర్యలు’

వేమనపల్లి: నాటుసారా అమ్మినా, తయారు చేసినా చర్యలు తప్పవని ఎస్సై శ్యాంపటేల్ అన్నారు. మండలంలోని రాజారాంకు చెందిన గుడుంబా విక్రయదారులు, యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారితో గుడుంబా అమ్మబోమని, తాగబోమని ప్రమాణం చేయించారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

జైపూర్: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లకు శనివారం మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు సంపత్‌రెడ్డి, రవి, జైపూర్ ప్రత్యేకాధికారి సత్యనారాయణ భూమిపూజ చేశారు.

‘అక్రమాలకు పాల్పడుతున్నారు’

లక్సెట్టిపేట: కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులు పీడీఎస్‌యూ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారని, వారిని నమ్మొద్దని సంఘం జిల్లా అధ్యక్షుడు చరణ్ అన్నారు. స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులతో మాట్లాడారు. పీడీఎస్‌యూ పేరుతో కొంతమంది డబ్బులు అడుగుతున్నారని, వారిపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ డిగ్రీ బీఏబీఎడ్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ మహాత్మా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఎన్‌టీఏ అర్హత పొందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 97032 67391, 99128 52567నంబర్లలో సంప్రదించాలని కోరారు.

10 నుంచి యోగా శిక్షణ తరగతులు

తాండూర్: స్థానిక విద్యాభారతి ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కన్వీనర్లు బ్రహ్మానందం, వెంకటేశ్వర్లు, లక్ష్మీ, పవన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామచంద్ర మిషన్, హార్ట్ ఫుల్‌సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 5.30నుంచి 6.30వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. వివరాలకు 9052697372 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నియామకం

లక్సెట్టిపేట: మండలంలోని టీఎన్‌జీవోస్ మండలాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గోళ్ల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి శనివారం తెలిపారు. స్థానిక ఐబీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సభ్యులు ఎన్నుకున్నారు.

ఎన్నికల విధులకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు



మాట్లాడుతున్న బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ

- మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల డివిజన్ పరిధిలో ఎన్నికల విధులు నిర్వర్తించే సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ ఆఫీసర్లకు ఎన్నికలకు సంబంధించిన శిక్షణ తరగతులను శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరిగే అవకాశం ఉన్నందున, ఎన్నికల విధులకు సంబంధించిన పూర్తి అంశాలను మాస్టర్ ట్రైనర్లు అందిస్తున్నారన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు సందేహాలను నివృత్తి చేసుకొని సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రఫతుల్లా హుస్సేన్, మాస్టర్ ట్రైనర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రక్రియ పూర్తి చేయండి

తాండూర్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఓటరు జాబితా ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ బీఎల్‌ఓలకు సూచించారు. మండలంలోని తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీఎల్‌వోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాల వారీగా ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు, తొలగింపు ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి తుది జాబితాను సిద్ధం చేయాలన్నారు. అనంతరం ప్రధాన శిక్షకులు హరిప్రసాద్, రమేశ్‌లు బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోత్స్న, సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మించరూ..!



భీమారం: మండలంలోని నర్సింగాపూర్ హనుమాన్ వీధిలో గల రోడ్డులో కల్వర్టు నిర్మించాల్సిన ప్రదేశంలో కంకరపోసి అధికారులు చేతులు దులుపేసుకున్నారు. రోడ్డు నిర్మించేప్పుడే కల్వర్టు నిర్మించాలని కోరినా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. కార్మికశాఖ మంత్రి వివేక్ గ్రామ పర్యటనకు వస్తున్నారనే నేపథ్యంలో రోడ్డులో పైపులు వేసి, దానిపై కంకర వేసి చేతులు దులుపేసుకున్నట్లు వాపోయారు. కంకరవేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, అధికారులు చర్యలు తీసుకొని కల్వర్టు నిర్మించి దానిపై సీసీ రోడ్డు నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.